క్లుప్తంగా

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


కొర్ర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర

హాలహర్వి: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త రాఘవేంద్ర అన్నారు. గురువారం మండలంలోని మెదెహాల్, చింతకుంట, హాలహర్వి తదితర గ్రామాల్లో పర్యటించారు. పత్తి, కొర్ర, కంది తదితర పంటలను పరిశీలించారు. పంటల సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడాలని చెప్పారు. ఏఓ శివశంకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఇంద్రజ, సూరన్న పాల్గొన్నారు.

పెంచిన ధరలను తగ్గించాలి


పత్తికొండలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం పత్తికొండ, తుగ్గలిలో ఆందోళ చేపట్టారు. పత్తికొండలో రామచంద్రయ్య మాట్లాడుతూ..దేశంలో నరేంద్ర మోదీ.. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ధరలను తగ్గించి సామాన్యుడికి అందుబాటులో ఉంచేలా చేస్తానని చెప్పారని, ఇంత వరకు ధరలు తగ్గించలేదన్నారు. రాజాసాహెబ్, రామాంజనేయులు, తిమ్మయ్య, పెద్దఈరన్న పాల్గొన్నారు.

పశువైద్యులు అందుబాటులో లేక ఆవు మృతి


మృతి చెందిన ఆవుతో రైతు గోపాల్

చిప్పగిరి: పశువైద్యులు అందుబాటులో లేక ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని బెల్డోణ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గోపాల్‌కు చెందిన ఆవు అనారోగ్యానికి గురికావడంతో పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చాడు. అయితే వైద్యులెవరూ అందుబాటులోకి రాకపోవడంతో మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా మృతి చెందిన ఆవుకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ప్రసన్నబాయి పోస్టుమార్టం చేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: పట్టణంలోని బస్టాండులో ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకుడు గజేంద్ర గ్రామస్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. గురువారం స్థానిక పాత బస్టాండులో ఆయన ప్రజలకు విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను పూజించాలని 200 మట్టి వినాయక విగ్రహాలు అందిస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

హొళగుంద: ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం హొళగుంద పోలీసులు పట్టుకున్నారు. ఆదోని మండలం ఢణాపురం, పెద్దగోనెహాళ్, మార్లమడికి గ్రామాలకు చెందిన వ్యక్తులు నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుకుని తీసుకెళ్తున్నట్లు తెలుసుకున్న ఎస్‌ఐ బాల నరసిహులు, సిబ్బంది దాడి చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని, తదుపరి చర్యలు వారే తీసుకుంటారని ఎస్‌ఐ చెప్పారు.

ట్రైసైకిళ్ల మంజూరు

మద్దికెర : మండలంలోని దివ్యాంగులకు 27 ట్రైసైకిళ్లు మంజూరయ్యాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత గురువారం తెలిపారు. గతంలో ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి నిపుణులతో పరీక్షలు చేయించామన్నారు. నడవడానికి వీలుకాని వారికి, చెవులు వినిపించని వారిని గుర్తించి జాబితా తయారు చేసి పరికరాలు పంపారన్నారు. మరిన్ని పరికరాలు రావాల్సి ఉందన్నారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న పౌష్టికాహార వారోత్సవాలు

వెల్దుర్తి: ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం మండల కేంద్రంతోపాటు, పుల్లగుమ్మి గ్రామ 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో సీడీపీఓ ల్యూక్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


బెల్డోణ గ్రామంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు


జలకళ సంతరించుకున్న మద్దమ్మకుంట


హొళగుంద: విగ్రహాన్ని కొని తీసుకెళ్తున్న భక్తులు

గణనాథులకు భలే గిరాకీ

- చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధం
- రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు
- చెరువుల్లో జలకళ
- అనుమతి తప్పనిసరి అంటున్న పోలీసులు


విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన గణపతి విగ్రహాలు,



గ్రామాలకు తరలిపోతున్న విగ్రహాలు


నిండుకుండలా కొండమ్మబావి


హొళగుంద: అమ్మకానికి ఉంచిన వినాయక విగ్రహాలు

మద్దికెర : లంబోదరుడికి ఘనంగా పూజలు నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గణనాథుడి విగ్రహాలు కొలువుంచడానికి ఆర్డర్లు కూడా ఇచ్చారు. ఈ ఏడాది వర్షాలు కురవడంతో చెరువులు, బావుల్లో నీరు కళకళలాడుతోంది. గణేశుడి నిమజ్జనాలు చేసుకోడానికి ఇబ్బందులు లేకపోవడంతో మరింత కోలాహలంగా వేడుకలు నిర్వహించేందుకు యువకులు, భక్తులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. గతంలో విగ్రహాలు కొనడానికి గుంతకల్లు, పత్తికొండ ప్రాంతాలకు వేళ్లేవారు. మూడేళ్లుగా మండల కేంద్రంలోనే తయారు చేస్తుండడంతో వ్యయప్రయాసలు తగ్గాయి. 3 అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు విగ్రహాలను ఇక్కడే తయారు చేస్తున్నారు. సైజును బట్టి రూ. 3 వేల నుంచి రూ. 20 వేల వరకు ధరలు పలుకుతున్నాయి.

చిప్పగిరి: శనివారం నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు మండపాల ఏర్పాటు, విగ్రహాల కొనుగోలులో నిర్వాహకులు నిమగ్నమై ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో మూడు, ఐదు, తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించిన భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా నిమజ్జం చేస్తారు. గతంలో పట్టణాలకే పరిమితమైన విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలు పల్లెల్లోనూ జోరందుకున్నాయి. మిత్రులు, గ్రామస్తులు చందాలు పోగు చేసుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామి వారి ప్రసాదమైన లడ్డూ వేలం ఉల్లాసంగా సాగుతుంది. భక్తులు పోటీపడి ప్రసాదం కొనుగోలు చేస్తుండటం విశేషం.

పండగలోపు విక్రయించాలి

సంవత్సరాం పాటు కుటుంబసభ్యులు అందరూ కలిసి 3 అడుగుల నుంచి 10 అడుగుల వరకు వినాయక విగ్రహాలు తయారు చేశాం. మండలంలోని గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. వారి కోరిక మేరకు వారికి నచ్చిన విధంగా తయారు చేసి ఇస్తాం.
– రంగస్వామి, తయారీదారుడు, మద్దికెర.

అనుమతి తప్పనిసరి



గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా పోలీస్, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ పరంగా జాగ్రత్తలు పాటించాలి. నిబంధనలు పాటిస్తూ అధిక శబ్దాలు లేకుండా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలి.
– విజయ్‌కుమార్‌నాయక్, ఎస్‌ఐ, మద్దికెర.

విక్రయాలు ఆశాజనకంగా లేవు

ఈ సంవత్సరం విగ్రహాల కొనుగోళ్లు ఆశాజనకంగా లేవు. విగ్రహాల తయారీకి రూ.10 లక్షలు వరకు పెట్టుబడి పెట్టి సుమారు 150 విగ్రహాలు తయారు చేసి సిద్ధంగా ఉంచాను. ఇప్పటి వరకు సగం విగ్రహాలు కూడా అమ్ముడు పోలేదు. అధిక వర్షాల కారణంగా కొనుగోళ్లు మందగించాయి. ముడి సరుకు రేట్లు పెరగడం వల్ల విగ్రహాల తయారీ భారంగా మారింది.
– నరసింహ, తయారీదారు, బెల్డోణ గ్రామం

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మండలంలోని ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి. విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి. ఏవైనా అల్లర్లు,గొడవలు,జరిగితే కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యత.
– రమేష్ బాబు, ఎస్‌ఐ

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు


అంగీకార పత్రాలతో పందికోన జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పత్తికొండ(తుగ్గలి) : మరణానంతరం ఒకరు చేసే నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పత్తికొండ మండలం పందికోన జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మహ్మద్‌హుసేన్, రాజశేఖర్, మధుసూదన్, మాజీ ఎంఎల్‌దో కుంపటి నారాయణ నేత్రదానానికి ముందుకొచ్చారు. ఇందుకు సంబంధించి ఒప్పంద అంగీకార పత్రాలను నేత్ర వైద్యునికి అందజేశారు. ఉపాధ్యాయులను హెచ్‌ఎం అబ్దుల్‌రెహ్మాన్, సీనియర్ ఉపాధ్యాయులు అగస్టీన్, చంద్రశేఖరరెడ్డి అభినందించారు.

కన్నడ టీచర్ కళాత్మకత


తాను తయారు చేసిన మట్టి వినాయక విగ్రహంతో ఉపాధ్యాయుడు తిప్పేస్వామి

హొళగుంద: ఆయన చిత్రలేఖన, శిల్పాల తయారీలో దిట్ట..పిల్లలకు ఓనామాలు దిద్దిస్తూనే అవే చేతులతో అపరూప శిల్పాలను రూపొందిస్తున్నారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్నడ పండితుడుగా పనిచేస్తున్న ఆర్ తిప్పేస్వామి. ఈయన కొన్నేళ్లుగా ఇక్కడ కన్నడ టీచరుగా కొనసాగుతున్నారు. విద్యార్థులకు ఈయన పాఠాలు అంటే ఇష్టం . ఏటా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి అడిగిన వారికి ఇవ్వడంతో పాటు, తన ఇంట్లో కూడా ప్రతిష్ఠించి పూజిస్తారు. ఈయన చేతిలో రూపుదిద్దుకున్న గణపయ్య విగ్రహాలు ఎంతో ఆకట్టుకునేలా ఉంటుండటంతో పలువురు అడిగి మరీ చేయించి తీసుకెళ్తుంటారు. శిల్పాల తయారీ, చిత్రలేఖనంలో కర్ణాటకలో పలు అవార్డులు కూడా తీసుకున్నారు. విగ్రహంలో జీవకళ ఉట్టిపడేలా తయారు చేయడం తిప్పేస్వామి ప్రత్యేకత. పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు సహకారాన్ని అందిస్తున్నానని చెబుతున్నారు ఆ మాస్టారు.

జింకను చంపిన చిరుత

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని తాపలకొత్తూరు గ్రామ సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. రోజూ మాదిరిగానే పొలాలకు వెళ్లిన రైతులకు, పశువుల కాపర్లకు పొలాల్లో జింకను చంపి పెద్దూరుకొండ సమీపంలోకి తీసుకెళ్తున్న చిరుతను చూసి ఈలలు, కేకలు వేశారు. దీంతో చిరుత జింకను బోయ రమేష్ అనే రైతు పొలం వద్ద వదిలేసి కొండలోకి వెళ్లిపోయిందని చెప్పారు. జూలై 14న కటారుకొండ గ్రామ శివారులో కూడా జింకను చంపిన ఆనావాళ్లను, పాదముద్రలను అప్పట్లో ఫారెస్టు అధికారులు పరిశీలించి చిరుతవే అని నిర్ధారించారు. రెండు నెలలు తిరగక ముందే ఇదే ప్రాంతంలో మరో జింకను చంపడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ కావడంతో పొలాలకు వెళ్లడానికి రైతులు, కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్టు అధికారులు చిరుతను పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించాలని వారు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ కొత్తమిద్దె మహేంద్రపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. అదే గ్రామానికి చెందిన బోయ వెంకటగిరి నాగేంద్ర గ్రామంలో కిరాణం షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి షాపులో మహేంద్ర సరుకులు తీసుకుని డబ్బులు అడిగిన నాగేంద్రపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితుడు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు, తుపాన్‌లతో నష్టపోయిన రైతులకు పంటలబీమా, ప్రస్తుతం అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలోని సీపీఎం కార్యాలయంలో రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9, 10, 17, 18వ తేదీల్లో నిర్వహించే వినతులు, ఆందోళన, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు హనుమంతు, సి.హనుమంతు, మండల అధ్యక్ష కార్యదర్శులు సూరి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

హొళగుంద: కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు తప్పెట రామిరెడ్డి, సిందువాళ కృష్ణయ్య, వెంకటేష్, అయ్యప్ప, సిద్ధప్ప, తిక్కస్వామి, మల్లి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న మిరప, పత్తి తదితర పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో తేమ శాతం అధికమై మొక్కల్లోనే కాయలు కుళ్లుతున్నాయని చెప్పారు. మిరప, ఉల్లి, వేరుశనగ పొలాల్లో నీరు నిలిచి మొక్కలు రంగు మారుతున్నాయన్నారు.

గుంతల రోడ్డు!


రాతన వద్ద రోడ్డుపై పడిన గుంత


జొన్నగిరిలో ఛిద్రమైన రోడ్డు


పత్తికొండ బైపాస్‌లో రోడ్డు దుస్థితి

తుగ్గలి : ఆదోని-గుత్తికి వెళ్లే ప్రధాన రహదారి గోతులమయమైంది. రహదారిలో పత్తికొండ మండలం దేవనబండ నుంచి తుగ్గలి మండలం జీ.ఎర్రగుడి వరకు అనేక చోట్ల గుంతలు పడ్డాయి. ప్రయాణం సాగక వాహన డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేందుకు భయపడుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం ఆదోని, మంత్రాలయం, గుత్తి, బెంగళూరుకు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వసంమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింతగా దెబ్బతిని గుంతల్లో నీరుచేరి ప్రమాదకరంగా మారింది. రోడ్డు శిథిలమవడంతో ప్రయాణం సాగడం లేదు. కి.మీ దూరం వెళ్లడానికి కనీసం 8 నిమిషాలకు పైగా పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డుపై నిత్యం అధికారులు కూడా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకొని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయండి


సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస నాయక్

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల మహిళా పోలీసుతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించాలని చెప్పారు. ఆలూరు ఎస్‌ఐ నరసింహులు ఉన్నారు.

10 నుంచి 'పొలం పిలుస్తోంది'

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 10 నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 10న టి.గోకులపాడు, 17న కంబాలపాడు, 24న ఎస్‌హెచ్‌ఎర్రగుడి, అక్టోబర్ 1న ఎరుకలచెర్వు, 8న లక్కసాగరం, 15న కోయిలకొండ, 22న ఆలంకొండ గ్రామాల్లో కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి పంటలను పరిశీలించి, పథకాల గురించి తెలియజేస్తామని వివరించారు.

85 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి

మద్దికెర : మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను 85 శాతం ఈ-క్రాప్ నమోదు చేశామని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ గురువారం తెలిపారు. రైతులు అధికారులకు సహకరించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. మిగిలిన పంట నమోదు కూడా త్వరగా పూర్తి చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ-క్రాప్ చేయించుకుంటే కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆలూరు: పట్టణంలో గుట్టుగా సాగుతున్న పేకాట స్థావరంపై గురువారం దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.55, 560 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సీఐ కె. శ్రీనివాసనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ఫాతెహాలు చేయగా.. భక్తులు సమాధులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి ఉదయం నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు


తెర్నెకల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

తుగ్గలి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం తుగ్గలి, పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎంలు నరేంద్ర, బాబురావు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మార్సీలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు చంద్రమోహన్, నర్సోజీరావు, బాలకృష్ణ, జాకీర్, నాగేశ్వరమ్మను ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఎంఈవోలు మాలతి, రామవెంకటేశ్వర్లు సన్మానించారు.

మద్దికెర : విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించడం మన సంప్రదాయమని ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు అన్నారు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక కొండమ్మ బావి వీధిలోనున్న ఎంపీపీ పేట స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేవనకొండ: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని తెర్నెకల్ గ్రామ సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గ్రామంలోని భువన విజయం కళావేదికలో సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 61 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, కోశాధికారి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, ఎంపీటీసీ నామాల శ్రీను, చాప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక హరిజనవాడ ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ వెల్దుర్తి బ్రాంచ్ మేనేజర్ ఎస్ విక్రమ్‌సింహారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఆర్.సంధ్య..హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సత్కరించి బహుమతులందించారు.

ఆస్పరి: శంకరబండ ప్రాథమిక పాఠశాలలో గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డు ఉపాధ్యాయుడు వెంకటరమణను సన్మానించారు.

కృష్ణగిరి: సమాజ పురోగతికి కృషి చేసే జ్ఞానజ్యోతి గురువేనని ఎంఈఓలు సునంద, మద్దయ్య అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అమకతాడు గ్రామంలో గ్రామస్తులు ఉపాధ్యాయులను సత్కరించారు. కృష్ణారెడ్డి, బాలమిన్నెల్ల, రాముడు, హనుమంతు, వెంకటేశ్వర్లు, రజాక్, సుధాకర్, ఉపాధ్యాయులు, ఎంఎంఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామల, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006లో 10వ తరగతి చదివిన విద్యార్థులు అప్పటి తమ హిందీ పండిట్ రామకృష్ణారెడ్డిని గురువారం ఘనంగా సత్కరించి కానుక అందజేశారు. అలాగే ఆయా పాఠశాలలో గ్రామపెద్దలు ఉపాధ్యాయులను సన్మానించారు.

చిప్పగిరి: స్థానిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వరదరాజులు ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులుగా పనిచేయాలని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎంపీపీ ఉర్దూ మెయిన్ పాఠశాల ఆవరణలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్నినిర్వహించారు. ఎంఈఓ కోమలాదేవి, ఎంఈఓ– 2 చిరంజీవిరెడ్డి, పీఎంసీ చైర్మన్ బాషా తదితరులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. ఎమ్మార్సీ కార్యాలయంలో సర్వేపల్లి జయంతి వేడులను నిర్వహించారు. ప్రభుత్వ ఐటీఐ, జూనియర్‌కళాశాల, పాలిటెక్నికల్ ,అరికెర గురుకుల, ఆలూరు గిరిజన పాఠశాల, మెడల్ స్కూల్ జెడ్పీ హైస్కూల్ 1, 2 డిగ్రీ కళాశాలలో వేడుకలను జరుపుకున్నారు.